# సొంత ఇల్లు - ఉన్నవ విజయలక్ష్మి

సుజాత కాలుగాలిన పిల్లిలా ఇటూ అటూ తిరుగుతోంది. "సూర్యం ఇంకా రాలేదేమిటమ్మా?" అని కామాక్షమ్మ అయిదోసారి అడిగింది ఆదుర్దాగా.

ఆవిడ అలా అడిగిన ప్రతిసారీ, ఏం సమాధానం చెప్పినా సుజాతకి ఏదో తప్పు చేస్తున్నాను అన్న మొహమాటం కలుగుతోంది. అయినా, "అదేనండి నేనూ చూస్తున్నాను. ఏదో పని మీద వెళ్లి ఉంటారు" అంది.

మరో గంట గడిచింది. రాత్రి ఎనిమిది గంటలు దాటిపోయాక ఉసూరుమంటూ ఇంట్లో కాలు పెట్టాడు సూర్యం.

"ఏం బాబూ! ఇం తాలస్యం అయింది. నాన్నగారు కూడా కంగారుపడుతున్నారు" అంది కామాక్షమ్మ కొడుకు కంటపడగానే.

"కొంచెం పని మీద వెళ్లాల్సి వచ్చింది. నాన్నగారు భోజనం చేశారా?" అనడిగాడు, తన నీరసం, నిస్త్రాణ తల్లికి తెలియకుండా జాగ్రత్తపడుతూ.

"ఇంకా లేదు. ఆయన్ని తినేసేయమని నేను ఎన్నిసార్లు చెప్పినా, అబ్బాయిని కూడా రానీ అంటూ కూర్చున్నారు."

"అరెరె —ఎందు కలా చేశారు. సరే వడ్డించేసెయి. అయిదు నిముషాల్లో బట్టలు మార్చుకుని కాళ్లూ, ముఖం కడుక్కుని వచ్చేస్తాను" అంటూ హడావిడిగా గదిలోకి వెళ్లిపోయాడు.

అందరి భోజనాలూ, తరువాతి పనులూ అయి సుజాత గదిలోకి వెళ్లేసరికి సూర్యం మంచం మీద వెల్లకిలా పడుకుని పైన గిర్రున తిరుగుతున్న సీలింగు ఫాను వంక రెప్ప వాల్చకుండా చూస్తున్నాడు —అంతకన్న ముఖ్యమైన పని మరొకటి తన కింకేం లేదు అన్నట్లు. సుజాత లోపలికి వచ్చిన అలికిడి కూడా అతనికి తెలియలేదు.

"ఇంతకీ ఏమయిందండీ?" మంచం మీద కూర్చుంటూ అడిగింది సుజాత. భర్త ఇంటికి వచ్చిందగ్గర నుండీ ఎప్పుడెప్పుడు ఆ విషయం అడుగుదామా అని ఆరాటంగా ఉన్నా, అత్తగారు కొడుకు ఎప్పుడు వస్తాడా అని చూస్తూ కూర్చోవటం, ఈ మధ్యే జబ్బు పడి లేచిన మామగారు భోజనం అయినా చెయ్యకుండా కొడుకు కోసం కనిపెట్టుకుని ఉండటం ఇవన్నీ కలిసి ఆమెని భర్తని మాటల్లో పెట్టకుండా ఆపుచేశాయి.

సుజాత పెళ్లి అయి అయిదు సంవత్సరాలపైనే అయింది. అప్పటికి సూర్యం, సుజాత ఇద్దరూ కూడా ఉద్యోగాలు చేస్తున్నారు.

ఉద్యోగం చేస్తున్న కోడలు కావాలని కామేశ్వరావుగారు, కామాక్షమ్మ కూడా ఎప్పుడూ అనుకోలేదు. కాని, అన్నీ బాగున్న సంబంధం ఆ ఒక్క కారణంతో మానుకోవాలనిపించలేదు. ఏదో పెళ్లికాక పూర్వం చేసింది, ఇప్పుడు వీలు కాకపోతే మానేస్తుంది. అయినా పిల్లా పాపా బయలుదేరి బాధ్యతలు ఎక్కువయితే ఆ అమ్మాయికి ఉద్యోగం చేసే ఓపిక ఉండదు అనుకున్నారు ఆ దంపతులు.

పెళ్లి అయిపోయింది. కామేశ్వరరావుగారు కట్నం ఏమీ అడగలేదు. పెళ్లికొడుక్కి, వియ్యపురాలికీ, ఆడబడుచుకీ ఏవో లాంఛనాలు జరిపి పెళ్లి చేశాడు సుజాత తండ్రి. ఎంత క్లుప్తంగా జరుపుకుందామనుకున్నా కామేశ్వరరావు గారికి యాభై వేల పైనే ఖర్చయింది.

కామేశ్వరరారవు పెద్దగా ఆస్తిపరు డేమీ కాదు. స్వగ్రామంలో ఒక చిన్న ఇల్లు ఉంది. హైదరాబాదులో ఓ మాదిరి ఉద్యోగం ఉంది. ఇద్దరు కొడుకులూ, ఓ కూతురూ. వాళ్లని పెంచటానికీ, చదివించటానికీ ఆయన చాలా ఇబ్బందులు పడ్డారు. సూర్యం ఎమ్మే పాసయి ఉద్యోగంలో చేరాక ఆయన పని కాస్త తెరిపిన పడ్డట్లయింది.

అంతవరకూ అద్దె ఇళ్లల్లో ఉండి ఆ ఇబ్బందులూ అవీ పడిన కామాక్షమ్మకి ఇంకనయినా ఓ సొంత ఇల్లు ఏర్పరచుకుంటే బాగుంటుం దనిపించింది.

"ఇల్లు కొనుక్కోటం అంటే ఇప్పుడు మనకి సాధ్యమయ్యే పనేనా. ఫ్లాటు ఏదైనా అనుకూలం అయినది దొరుకుతుందేమో చూద్దాం" అన్నారు కామేశ్వరరావు గారు.

అక్కడా అక్కడా వాకబు చేసిన మీదట ఓ ఫ్లాటు అమ్మకాని కుందని తెలిసి, ఆఫీసులో అప్పు తీసుకుని ఆ ఫ్లాటు తీసుకున్నారు.

"ఈ అప్పుకోసం నెల నెలా జీతంలో కొంత డబ్బు విరగ్గోసుకుంటా రనుకోండి. అయినా అబ్బాయి జీతం కూడా ఉంది కనుక ఇబ్బంది ఉండదు. మన ఊళ్లో ఇ ల్లుంది. ఇక్కడ ఫ్లా టుంది. అబ్బాయిల కిద్దరికీ చెరోటి ఇవ్వొచ్చు. ఇంక సుశీల పెళ్లికి ఏదో చూసుకోవాలి" అని కామాక్షమ్మ అంటుంటే—

"మన సూర్యం చెల్లెలి పెళ్లి బాధ్యత తీసుకుంటాడులే. ఆ నమ్మకం నా కుంది" అన్నాడు కామేశ్వరరావుగారు ధైర్యంగా.

సూర్యం పెళ్లినాటికి సుశీల బియ్యే చదువుతోంది. ఆమె కన్న చిన్నవాడు రఘు ఇంటర్‌లో ఉన్నాడు.

సూర్యం పెళ్లి అయి ఏడాది కావస్తోంది.

ఓ రోజు సాయంకాలం సుజాత చాలా ఉత్సాహంగా ఆఫీసు నుండి వస్తూ...

"అత్తయ్యగారూ! నే నో ఫ్లాటు కొనుక్కుందాం అనుకుంటున్నాను" అంది సంతోషంగా.

"అలా గామ్మా. చాలా సంతోషం" అంది కామాక్షమ్మ. అసలు ఫ్లాటు ఎక్కడ, ధర ఎంత, నీ దగ్గర అంత డబ్బు ఉందా లాంటి వివరాలన్నీ అడగా లనిపించినా కోడలు ఏమయినా అనుకుంటుందేమోనని ఊరుకుంది. సరే అబ్బాయికి కూడా చెప్తుంది కదా. అ సుళువు బరువులు వాళ్లే చూసుకుని, నిర్ణయించుకుంటూరు అనుకుంది.

పెళ్లిలో కట్నం ఏమీ ఇవ్వలేనని బీద అరుపులు అరిచిన వియ్యంకుడు కూతురికి ప్రత్యేక ఫ్లాటు కొనిస్తాడేమో నన్న ఊహ కూడా ఒకసారి రాకపోలేదు ఆవిడికి. అలా అయితే కోడలు "మా నాన్న కొనిస్తున్నాడు" అని గర్వంగా చెప్పకుండా, "నేను కొనుక్కుంటున్నాను" అని ఎందు కంటుంది అని తనకి తనే సమాధానం చెప్పుకుంది మళ్లీ. సరే నాలుగు రోజులు ఆగితే అన్ని విషయాలు బయటపడతాయి అనుకుని ఉరుకుంది.

ఆ రాత్రి సుజాత భర్తతో కొత్త ఫ్లాటు విషయం చెప్పింది.

"నీ దగ్గర అంత డబ్బు ఉందా?" అని అడిగా డతను అమాయకంగా.

"నా దగ్గర లే దనుకోండి. మనం ఇద్దరం కలిసి కొనుక్కోవాలి" అంది సుజాత.

"అంత డబ్బు నా దగ్గ రెక్కడుంది?" విస్తుపోయా డతను.

"అబ్బ... మీ కేదీ త్వరగా అర్థం కాదు. ఇప్పు డెవరూ చేతిలో డబ్బు పెట్టుకుని ఇళ్లూ వాకిళ్లూ బేరాలు చెయ్యటం లేదు. ఎక్కడో

అక్కడ అప్పు చేసి కొనుక్కుంటున్నారు. ఎవరిదాకో ఎందుకు —మీ నాన్నగారు కూడా అలాగే కొన్నారు కదా ఈ ఫ్లాటు. మనిద్దరి సంపాదనలలోనూ మనం పొదుపు చేసి మిగుల్చుకున్నది అంతో ఇంతో మనిద్దరిది ఉంది. ఇద్దరం ఆఫీసులోనూ, ఎల్లైసీలోనూ అప్పు తీసుకుందాం. అంతా కలిపి రెండు లక్షల రూపాయలు ముందు కట్టేస్తే, ఒక సంవత్సరం తిరిగేసరికి ఫ్లాటు రెడీ అయిపోతుంది. అప్పటికి మ నిద్దరం మరేమైనా ఏర్పాట్లు చేసుకుని మరో లక్ష రూపాయలు సిద్ధం చేసుకుని ఆ డబ్బు కూడా కట్టేశామంటే ఫ్లాటు మన దయిపోతుంది.

ఉండండి, నన్ను పూర్తిగా చెప్పనివ్వండి. తరువాత తీరు స్తాను మీ సందేహాలు.. ఆ.. ఒక్క



## ఆకాశం నుంచి ఊడిపడిన తార!

తారలకు విమాన ప్రయాణాలు చేయటం రివాజు. అయితే విమానాల్లో విహరించేవారు తారలుగా మారటం విశేషం!

అటువంటి అరుదైన అభినేత్రి కాంచన ఉరఫ్ వసుంధర. 'భట్టి విక్రమార్క' చిత్రంతో బాల తారగా చిత్రసీమకు పరిచయమైంది. ఆ వెనుక చిత్రాలు రాకపోవడంతో ఎయిర్ హోస్టెస్‌గా ఉద్యోగంలో చేరింది. శ్రీధర్ 'కాదలిక్క నేరమిల్లై' చిత్రాన్ని కొత్తవారితో తీస్తూ, అందులో కథానాయికగా కాంచనను ఎంపిక చేశారు. దాంతో కాంచన తిరిగి కథానాయికగా రంగ ప్రవేశం చేసింది. చేజారిన చిత్రావకాశాలే వెతుక్కుంటూ వచ్చి అగ్రశ్రేణి కథానాయికగా మార్చేశాయి.



సేకరణ : అట్లూరి శరత్‌బాబు

ఏడాదిలో ఇల్లు తయారయిపోతుందని చెప్పాను కదూ! మొత్తం మూడు లక్షలకి మలక్‌పేటలో ఫ్లాటు అంటే కారు చవక. ఇలాంటి అవకాశం మనకి మళ్లీ మళ్లీ రాదు. దీన్ని వదులుకోకూడదు మనం. అసలు ఇళ్ల ధరలూ, స్థలాల ధరలూ రోజు రోజుకీ పెరిగిపోతున్నాయిట. మనం మెల్లిగా డబ్బు కూడబెట్టి ఎప్పుడో కొనుక్కోవాలంటే అప్పటికి ఇదే ఫ్లాటు ఇరవే లక్ష లయినా ఆశ్చర్యం లేదు" అని ఉపన్యాసం లాంటి దిచ్చింది ఏకబిగిని.

"అసలు ఈ వివరాలన్నీ నీ కెలా తెల్సిశాయి?" అని అడిగాడు సూర్యం. అతని కిదంతా అయోమయంగా ఉంది.

"నా కొలీగ్ అరవింద లేదూ... తనూ, వాళ్లాయనా కలిసి ఓ ఫ్లాటు కొనుక్కుంటున్నారుట. తనే నాకు చెప్పింది. ఈ అప్పు చెయ్యటం ఉపాయం కూడా తనే చెప్పింది. వాళ్లిద్దరూ కూడా ఇలాగే లోను తీసుకుంటున్నారుట. మలక్‌పేటలో మెయిన్ రోడ్డుకి దగ్గరగా తయారవుతున్న ఈ అపార్టుమెంట్స్‌లో ఒక్క ఫ్లాటే మిగిలి ఉందట. నీ క్కావాలంటే వెంటనే చెప్పు. అది కూడా ఇంకెవరో ఎగరేసుకుపోకుండా నీకు వచ్చేలా చూస్తాం అని చెప్పింది. ఏ సంగతీ నేను తనకి రేపు చెప్పాలి. తరువాత మనం ఇద్దరం లోన్లకి అప్లై చెయ్యటం, అదీ ఉంటుం దనుకోండి. మనం ఈ అవకాశం వదులుకోకూడదు" అంటూ చాలా ఉత్సాహంగా చెప్పింది. సుజాతకి చాలా సంతోషంగా ఉంది. ఇంత చిన్న వయస్సులోనే ఒక ఇంటికి స్వంతదారు కావటం అంటే నిజంగా అదృష్టమే మరి అనుకుంది.

సూర్యం ఆలోచనలో పడ్డాడు.

"అప్పు చేశామంటే ఇద్దరి జీతాలతో కట్ ఉంటుంది. తెలుసుగా" అన్నాడు.

"అబ్బ.. ఆమాత్రం తెలియదా! అయినా ఇప్పటిలాగే మీరు ఇంటి ఖర్చులకి డబ్బు ఇవ్వగలిగేలా చూసే పూచి నాది. కాకపోతే మన సరదాలూ, పై ఖర్చులూ కాస్త తగ్గించుకుంటే సరి. మా అరవింద వాళ్లు కూడా అలాగే అనుకుంటున్నారుట. ఇలా అప్పు చేసి కొనుక్కోకపోతే మనం జీవితంలో ఏ వస్తువూ అమర్చుకోలేం అంటుంది అరవింద. తన మాటలు విన్నాక నాకూ అదే నయం అనిపించింది. అరవిందా వాళ్లు కలర్ టీవీ, ఫ్రిజ్, గాడ్రెజ్ బీరువా అన్నీ కూడా ఇలా లోన్ తీసుకునే కొనుక్కున్నారుట. ఫ్లాటు అంటే పెద్ద మొత్తం కనక ఆ లోన్ తీరటానికి కొంచెం ఎక్కువ రోజులు పడుతుంది. అందుకు మనం ఏం గాబరా పడక్కరలేదు. ఇవాళ కాకపోతే మరో ఇరవై ఏళ్ల కయినా ఆ అప్పు తీర్చేయగలం. ఇరవై ఏళ్ల తరువాత ఒక్కసారిగా డబ్బు పోసి కొనుక్కోవాలన్నా, ఆ సరికి మనం సేవ్ చేసిన డబ్బుతో ఒక్క గది కూడా రాదు అని చెప్పింది అరవింద. నిజమే కదా ఆ మాట" అని సుజాత చెప్తూంటే, అందులో నిజం లేదు అని చెప్పటానికి సూర్యానికి ఆస్కారమే కనిపించలేదు.

"అవును. అది ముమ్మాటికీ నిజమే. చూద్దాం. రేపు నేను మా ఆఫీసులో కూడా ఎవరినయినా సలహా అడుగుతాను. ముందు అమ్మకీ, నాన్న గారికీ చెప్పాలి" అన్నాడు.

"నేను రాగానే ఈ వివరాలన్నీ చెప్తా మనుకున్నాను. కాని మీ రేమంటారో ముందు తెలుసుకోవా లనుకుని ఇంత వివరంగా చెప్పలేదుగాని, అత్తయ్యగారికి చెప్పేశాను ఫ్లాటు కొనుక్కుంటున్నామని" అంది.

"చెప్పావా? అ మ్మే మంది?" అన్నాడు సూర్యం కుతూహలంగా.

"భలే ప్రశ్న వేశారు. ఆవిడా చాలా సంతోషించారు. ఎవరు మాత్రం అంతకన్న ఏం చేస్తారు?" అంది రవంత గర్వంగా.

"అవునులే. ఎవరయినా సంతోషించే పనే మరి ఇది" అన్నాడు అతనూ తృప్తిగా.

మర్నాడు ప్రొద్దుటే కాఫీ తాగుతూ సూర్యం, సుజాత ఏకబిగిని ఆ ఫ్లాటు విషయం చెప్పేశారు.

ఇదా సంగతీ! నే నింకా ఏమిటో అనుకున్నాను అని మనస్సులో అనుకున్నా పైకి సంతోషాన్నే కనబరచింది కామాక్షమ్మ.

ఇప్పటి కింకా మనం ఉంటున్న ఈ ఫ్లాటు అప్పే తీరలేదు. మళ్లీ అప్పు చేసి ఫ్లాటు కొంటామంటున్నారు వీళ్లు అనే సంకోచం కలిగినా దానిని పైకి చెప్పకుండా తన ఆనందాన్ని, సమ్మతినీ తెలిపారు కామేశ్వరరావుగారు.


వాళ్లిద్దరూ ఎలాంటి అభ్యంతరమూ చెప్పకుండా, మ రేలాంటి అడ్డు పుల్లలూ వెయ్యకుండా తమ పూర్తి ఆమోదాన్ని తెలపటం సూర్యానికీ, సుజాతకీ చాలా తృప్తిగా ఉంది. ఇద్దరూ చకచకా తయారయి ఆఫీసులకి వెళ్లిపోయారు.

"ఆ అప్పు తీరేదాకా కోడలు ఉద్యోగం మానే ప్రసక్తే ఉండదు" అన్నాడు కామేశ్వరరావుగారు భార్య వంక జాలిగా చూస్తూ.

"ఏదో అవుతుందిలెండి. ఇప్పటినుండీ ఎందు కా ఆలోచన?" అనేసింది కామాక్షమ్మ.

అనుకున్నట్టుగానే సూర్యం తన కొలీగ్ రాజుతో ఫ్లాటు విషయం చెప్పాడు.

"వండ్రఫుల్. నేనూ మొన్నే ఓ ఫ్లాటుకి అడ్వాన్సు ఇచ్చాను. నేనూ ఆఫీసులోనే లోను తీసుకున్నాను. మీకు తెలుసో, లేదో మొత్తం డబ్బు కూడబెట్టి ఏదైనా కొనుక్కోవాలి అన్న సిద్ధాంతానికి నేను పూర్తిగా వ్యతిరేకం. అందుకేనేమో అప్పు ఉంటే తప్ప నిద్ర పట్టదు. ఓసారి అప్పు చేసి ఓ వస్తువు కొనుక్కోటం, మెల్లిగా తీరాక మళ్లీ అప్పు చేసి మరోటి కొనుక్కోటం —ఇదీ నా పద్ధతి. అప్పు లేకపోతే మనం డబ్బు ఆదా చెయ్యాలనే ధోరణే ఉండదు. వచ్చిందంతా ఖర్చు పెట్టేస్తూంటాం" అని అతను చెప్తూ ఉంటే—



సెక్రెటరీ అతి వినయం (వచ్చిన పెద్ద మనిషితో) : దయచేయండి, ఎవరు కావాలి సార్!

పె.మ. : మీ బాస్ మాధవరావు!

అతివినయం : పనేమిటో చెప్తారా?

పె.మ. : చెల్లించాల్సిన బిల్లొకటుంది.


అతివినయం (నవ్వుతూ) : ఓహో ... ఆయన నిన్న సాయంకాలమే వాళ్ల గ్రామం ...

పెమ. : బిల్లు చెల్లించాల్సింది నేను.

అతి వినయం : ... వెళ్లి, ఇవాళ పొద్దుటే వచ్చారు! లోపలికి వెళ్లండి, సార్!

"ఆ మాటా నిజమేలెండి" అన్నాడు సూర్యం.

"అసలు ఈ విషయంలో విదేశీయులు మనకంటే చాలా ముందు ఉన్నారు అనిపిస్తుంది నాకు. అందుకే అక్కడికి వెళ్లిన మనవాళ్లు కూడా ఆ పద్ధతులన్నీ అలవాటు చేసుకుంటున్నారు. మా చిన్నాన్న కొడుకు ఏడాది కిందట అమెరికా వెళ్లాడు. అక్కడికి వెళ్లగానే ఉద్యోగం దొరికింది. తరువాత రెండు నెలలకే కారు కొన్నాడు. ఆరు నెలలకే ఇల్లు కొన్నాడు. ఇంక ఇంటికి కావలసిన ఫర్నిచరు సంగతి చెప్పనే అక్కరలే దనుకోండి. వాడిని తలుచుకుంటూంటే మా అందరికీ అసూయ కలుగుతుం దనుకోండి. ఇదంతా ఎందుకు చెప్తున్నానంటే అప్పు చేస్తున్నాను అని మీరేం బెంగ పెట్టుకోకండి. మనం ఇలా ఉద్యోగం చేస్తూనే ఉంటాం. నెలనెలా అప్పు దానంత టదే తీరిపోతూ ఉంటుంది. దైవం మేలు చేసి మనకి ప్రమోషనూ, గ్రట్రా వచ్చాయంటే ఇంకా ఎంత అప్పు అయినా చెయ్యొచ్చు. శుభస్య శీఘ్రం అన్నారు. ఇవాళే లోనుకి అప్లికేషను పడేయండి" అని సలహా ఇచ్చాడు రాజు.



నెల రోజులు తిరిగేసరికి రెండు లక్షల రూపాయల రొక్కం బిల్డరు చేతిలో పొయ్యటం అయిపోయింది. దాని కోసం సూర్యానికీ, సుజాతకీ దొరికిన అప్పుతోపాటు అంతవరకూ వా ళ్లిద్దరూ దాచుకున్న కొంచెం మొత్తమే కాకుండా, సుజాత దగ్గరున్న కాస్త బంగారం కూడా అమ్మేసింది.

మరి కొద్ది రోజులకే సుశీలకి పెళ్లి నిశ్చయం అయింది. కామేశ్వరరావుగారు కొడుక్కి కట్నం తీసుకోలేదుగాని, ఆయన కూతుర్ని కట్నం లేకుండా పెళ్లి చేసుకునే పెళ్లికొడుకు ఎవరూ కనిపించలేదు. చివరికి విసిగిపోయి యాభైవేల రూపాయల కట్నానికి ఒక సంబంధం నిశ్చయం చేసుకున్నాడు. ఖర్చులూ, అంతా కలిపి ఎంత లేదన్నా లక్షపైనే అవుతుం దనిపించింది. ఎవరి దగ్గరా అయిదు వందల రూపాయలకి మించి లేదు. ఉద్యోగం చేస్తున్న ముగ్గురి ఆఫీసుల్లోనూ అప్పు మాత్రం ఉంది. ఇంక అక్కడ ఒక్క నయాపైసా అయినా పుట్టదు. బయట ఎక్కడయినా అప్పు చెయ్యాలన్నా అంత డబ్బు ఎవరిస్తారు, ఇచ్చినా దానిని ఎలా తీర్చాలి? అన్నీ ఆలోచించి చివరికి స్వంత ఊరిలో ఇల్లు అమ్మాలని తీర్మానించుకున్నారు.

"ఆ ఇల్లు ఉంటే, మగపిల్ల లిద్దరికీ చెరో ఇల్లూ ఉంటుం దనుకున్నాను" అంది కామాక్షమ్మ భర్తతో.


"అన్నీ మనం అనుకున్న ట్లవవుగా." అనేశా రాయన.

ఇల్లు అమ్మకం అయింది. సుశీల పెళ్లి అయి అత్త వారింటికి వెళ్లిపోయింది.

సూర్యం వాళ్లు డబ్బు కట్టిన సంవత్సరానికి పూర్తి అవుతుంది అనుకున్న ఫ్లాటు రెండు సంవత్సరా లయినా పూర్తి కాలేదు. నాలుగు రోజుల కోసారి సూర్యం, సుజాత, అరవిందా, ఆమె భర్త, ఇంకా మిగిలిన వారూ ఆ సైటు దగ్గరికి వెళ్లి వస్తున్నారు. పదిసార్లు తిరిగితే ఒకసారి కనిపిస్తున్నాడు ఆ బిల్డరు. ఆ కనిపించినప్పు డయినా ఆకుకి అందకుండా, పోకకి పొందకుండా ఏదో చెప్తున్నాడేకాని, ఫలానా టైముకి ఇల్లు పూర్తి అవుతుందని చెప్పటం లేదు. కట్టడం పని మాత్రం చాలా జాప్యం జరుగుతోంది.

అప్పటికే సుజాత నెల తప్పింది. కామాక్షమ్మకి చాలా సంతోషంగా ఉంది గాని, సుజాతకి మాత్రం అబార్షన్ చేయించుకుంటే బాగుండు ననిపించింది.

"నీ వయస్సు ముప్పై ఏళ్లు అంటున్నావు. ఇప్పటికే ఆలస్యం అయింది. ఇంకా ఆలస్యంగా తొలి కానుపు వస్తే కొంచెం కష్టం అవుతుంది. అంతగా అయితే ఈ బిడ్డ పుట్టాక ఏకంగా ఆపరేషను చేయించుకుందువుగాని, అంతేకాని ఇప్పుడు ఎబార్షన్ వద్దు" అని సలహా ఇచ్చింది లేడీ డాక్టర్.



**మిగతా ఏడుగురూ!**

ఒకడు — తన స్నేహితుడితో :

చిన్నా! నేను మా ఆఫీసులో ఒక అందమైన అమ్మాయిని ప్రేమించానురా! అంత మహత్తర మనిషిని ఎక్కడా చూడం. నిజం చెప్పాలంటే ఈ ప్రపంచంలో ఎనిమిదో అద్భుతం అనాలని ఉంది.

మిత్రుడు : కొంపతీసి ఆమెతో ఇంకా అనలేదు కదా! మిగతా ఏడుగు రెవరని ప్రాణం తీసేయ్యగలదేమో జాగ్రత్త!

సుజాతకి ఆ పిల్లవాడిని కనక తప్పలేదు. వాడు కడుపులో ఉన్నన్నాళ్లూ సుజాతకి వేవిళ్లో, మరేదో, ఇంకేదో అంటూ ఒకటే చికాకు చేసింది. ఆఫీసుకి వెళ్లాలనీ, అసలు ఉద్యోగం చెయ్యాలనీ అనిపించేది కాదు. కాని ఉద్యోగం ఎలా మానుతుంది. చచ్చేటంత అప్పు నెత్తి మీద తన్నుతోంది. దానిని తీర్చక తప్పదు. అందుకని ఉద్యోగం చెయ్యకా తప్పదు అనుకుంది.

పురిటికి పుట్టింటికి వెళ్లింది. మూడు నెల లుంది. ఆమె లీవు పూర్తయింది. మూడు వారాల పసిగుడ్డుని ఎత్తుకుని సుజాత అత్తవా రింటికి వచ్చేసింది.

ఇహ బాబూ ఆలనా పాలనా మొత్తం కామాక్షమ్మ మీద పడింది. మొదటి నుండీ ఆమె ఆరోగ్యం అంతంత మాత్రమే. కీళ్ల నొప్పులూ అవీను. ఇప్పుడు కాస్త వయస్సు మళ్లేసరికి హై బ్లడ్ ప్రెషరు కూడా వచ్చింది. ఈ చికాకా లన్నింటితో ఇంటి పనీ, బాబు పనీ చేసుకోలేక కోడలిని ఉద్యోగం మానేయమందామని చాలాసార్లు అనుకుంది కాని, అది జరిగే పని కాదని ఊరుకుంది.

కామేశ్వరరావుగారు ఆ ఏడే రిటైరయ్యారు. ఆయనకి రావలసిన ప్రావిడెంట్ ఫండూ ఆదీ ఆయన తీర్చవలసిన బాకీకి సరిపోయింది. వంట్లో ఇంకా కాస్త ఓపిక ఉంది కనుక మరో చిన్న ఉద్యోగంలో చేరారు — లేకపోతే ఇల్లు గడవటం కష్టం అయిపోతుందని.

ఇంటి పరిస్థితి అర్థం చేసుకున్న రఘు బియ్యేస్సీ అవగానే మరి పైకి చదవకుండా ఉద్యోగ ప్రయత్నంలో పడ్డాడు. ఒక సంవత్సరం గడిచినా అతనికి ఉద్యోగం దొరకలేదు. అతను దిగులు పడిపోతుంటే ఇంట్లో అందరికీ కూడా ఏదోలా ఉంటోంది.

అలాంటి సమయంలోనే పులి మీద పుట్రలా మరో వార్త అందింది. ఓ ఉదయం అరవింద నురుగులు కక్కుకుంటూ వచ్చి —"ఎంత మోసం జరిగిందో చూశావా సుజా! మనందరి

## తెలివైన రమ్యకృష్ణ



"టాప్ హీరోయిన్ అనిపించుకున్న తారలు హీరోయిన్ ఓరియెంటెడ్ చిత్రాలు చేయటం పట్ల ఆసక్తి చూపుతున్నారు కదా? మరి నీ సంగతేమిటి?" అని రమ్యకృష్ణను ప్రశ్నిస్తే — "హీరోయిన్ ఓరియంటెడ్ పాత్రలు చేయమని నన్నూ అడుగుతున్నారు. కానీ నేనిప్పుడే చేయాలనుకోవటంలేదు. బాగా సీనియర్ అనిపించుకున్నాక చేయాలనుకుంటున్నాను. నా కంత సీనియారిటీ రాలేదు కదా? అదీకాక హీరోయిన్ ఓరియంటెడ్ చిత్రాలకు చాలా రోజులు వరసగా డేట్స్ ఇవ్వాల్సి ఉంటుంది. దాని వలన నేను హిట్టయ్యే కమర్షియల్ చిత్రాలలో నటించే అవకాశం కోల్పోవలసి ఉంటుంది. మరి ముఖ్యంగా హీరోయిన్ ఓరియెంటెడ్ పాత్రలే చేస్తాననే బ్రాండ్ పడితే టాప్ రేంజ్‌లో ఉన్న కమర్షియల్ హీరోలెవరూ నాతో నటించడానికి ఆసక్తి చూపరు" అంటూంది. తన సీనియర్ నటి విజయశాంతి కెరీర్‌ని చూసి నేర్చుకున్న పాఠం కాబోలు!

సేకరణ: ఆర్.డి.ఎస్.ప్రకాష్
(విశాఖ)

దగ్గర రెండేసి లక్షల రూపాయలు తీసుకున్న బిల్డరు ఇంతవరకూ మనకి ఫ్లాటు అప్పగించలేదు సరికదా, వాటిని మరెవరికో ఇస్తానని మళ్లీ డబ్బు తీసుకున్నాడుట" అంది.

"నిజంగానా?" హడలిపోతూ అడిగింది సుజాత.

"నిజమే, నాలుగు ఫ్లాట్లు పూర్తి చేసి మొదటి వాళ్లకే ఇచ్చేశాడుట. మరి అది ఎలా జరిగిందో నాకు తెలియదు. మిగిలిన ఎనిమిదింటికీ మళ్లీ మరెవరి దగ్గరో డబ్బు తీసుకున్నాడట."

"మ రిప్పు డెలా?" అంది సుజాత బిక్క ముఖంతో.

"ఏముంది. మనం అందరం కలిసి కోర్టుకు వెళ్లాలి" అంది అరవింద —అన్నీ ముందే ఆలోచించుకుంది కనుక.

ఇహ తప్పేదేముంది. అంతా కలిసి ప్లీడరు దగ్గరికి వెళ్లారు. రెండేళ్లు కోర్టు చుట్టూ తిరిగారు. ప్లీడరు వ్యవహారం అంటే డబ్బు లేకుండా జరగదు కదా! మళ్లీ అందిన దగ్గరంతా అప్పులు చేసి డబ్బు మంచినీళ్లలా ఖర్చు చేశారు.

చివరికి, ఇవాళ సూర్యం పట్టుకొచ్చిన వార్త ఏమిటంటే ఆ బిల్డరు రాజీకి వచ్చాడుట. అయితే అప్పుడు మూడు లక్షలు అవుతుంది అనుకున్న ఫ్లాటు ఇప్పుడు అయిదు లక్షలు అవుతుంది. నాలుగేళ్ల క్రిందటే మీకు ఫ్లాటు ఇవ్వకపోవటం నా తప్పే. అనుకోని ఇబ్బందు లేవో నా మెడకి చుట్టుకుని ఇంటి పని పూర్తి చెయ్యలేనివ్వలేదు. మీ రంతా ఆ తప్పు క్షమించాలి. ఇప్పు డింకొక మూడు లక్ష లిచ్చారంటే ఆరు నెలల్లో మీకు ఫ్లాటు అప్పగించేస్తాను. అలా మీ కిష్టం లేకపోతే మీ రిదివరకు ఇచ్చిన రెండు లక్షల రూపాయలూ వాపసు చేసేస్తాను. మీరు ఆలోచించుకుని రెండు రోజులలో చెప్పండి. ఇదీ ఆ బిల్డరు చెప్పిన మాటల సారాంశం.

వింటున్న సుజాతకి దిక్కు తోచలేదు. ఆగ్రహం, దుఃఖం, ఉడుకుమోత్తనం అన్నీ ఆమెని ఉక్కిరిబిక్కిరి చేసేశాయి. కాని, ఏం చేసేటట్లు?

సూర్యం, సుజాతా రాత్రంతా ఆలోచిస్తూనే ఉన్నారు. ఇద్దరికీ కంటిమీదికి కునుకు వాలలేదు.

"అసలు నాకు ఈ ఫ్లాటు కొనాలనే ఆశ ఎందుకు కలిగిందో... ఇప్పుడు మనం నాన్నగారు కొన్న స్వంత ఫ్లాటులోనే ఉంటున్నాం కాని, అద్దె కొంపలో ఇబ్బంది పడటం లేదు. రఘు పెళ్లి అయి భార్య వచ్చినా, ఇద్దరం ఇందులోనే ఉండేవారం, లేకపోతే ఊళ్లో ఉన్న ఇల్లు అమ్మి మరో ఫ్లాటు అప్పుడే కొనుక్కునే వాళ్లం. అయినా రఘుకీ ఈ ఊళ్లనే ఉద్యోగం అవుతుందనే నమ్మకం ఏమిటి? మనం ఇద్దరం ఇంటి కోసం ఇలా అప్పుల్లో మునిగిపోకుండా ఉంటే, నేను అప్పు తీసుకుని సుశీల పెళ్లికి సాయం చెయ్యగలిగేవాడిని. అప్పుడు గ్రామంలో ఇల్లు అమ్మాల్సిన అవసరమూ ఉండేది కాదు. అమ్మా, నాన్నగారూ సరదాపడినట్లు, నాన్నగారు రిటైరు అయ్యాక వాళ్లు అక్కడికి వెళ్లి కొన్నాళ్లు ఆ ఇంట్లో ఉండగలిగేవారు. వారికి తృప్తి మిగిలేది" అంటున్న సూర్యం గొంతులో బాధా, పశ్చాత్తాపమూ, బిడియమూ సుడులు తిరుగుతున్నాయి.

"అవునండీ. నేను ఇలా ఆఫీసులో అప్పులో ఇరుక్కుపోకపోతే బాబు పుట్టగానే ఉద్యోగం మానేసేదాన్ని. అత్తయ్యగారు అనారోగ్యంతో కూడా వాడిని చూసుకోవలసిన గండకత్తెర వచ్చేది కాదు. అసలు మనం ఉండటానికి ఇల్లు ఉండగా మరో ఇల్లు కావాలని ఎందు కనుకున్నాం. పోనీ అంటే చేతిలో ఉన్న డబ్బు పెట్టి కొనుక్కోటం కాదు. అప్పు చేసి. అసలు ఈ అప్పు చెయ్యటం అనేది ఇప్పటి వారిలో మరీ ఎక్కువయిపోయింది. అప్పు లిచ్చేవారుకూడా అదొక వ్యాపారంగా పెట్టుకుని జనాలని ప్రలోభపెట్టి అరచేతిలో వైకుంఠం చూపిస్తున్నారు. మాకు వద్దు బాబూ అని మొత్తుకున్నా, ఏదో విధంగా తమ వస్తువు అమ్ముడుపోవాలని వారి తాపత్రయం.

ఇళ్లు, కార్లు, టీవీలు, ఫ్రిజిడేర్లు, ఆఖరికి చీరలు కూడా వాయిదాల పద్ధతిలో కొనుక్కోవటం ఒక ఫ్యాష నయిపోయింది. ప్రతి నెలా ఈ వాయిదాలన్నీ తీర్చటానికే సగంపైగా జీతం ఖర్చయిపోతుంది. భార్యాభర్త లిద్దరూ ఉద్యోగాలు చేసి నాలుగు చేతులా సంపాదిస్తున్నారు అన్న పేరేగాని చేతిలో నయాపైసా మిగలటం లేదు. బాంకిలో ఒక వెయ్యి రూపాయలు ఏ అత్యవసర పరిస్థితికయినా తట్టుకోటానికి ఆధారంగా ఉండటం లేదు" అంది సుజాత.

"నేను ఈ అప్పులలో ఇరుక్కుపోకపోతే రఘు బియ్యేస్సీతో చాలించుకుంటానంటే చూస్తూ ఊరుకునే వాడినా? నాన్నగారు ఈ వయస్సులో కూడా శ్రమపడుతూ మళ్లీ ఉద్యోగం చెయ్యక్కరలేకుండా సరిపోయేది కదా నా జీతం. అమ్మకి విశ్రాంతి ఇచ్చి, నువ్వు ఇంటి పని చూసుకుంటూ ఉంటే ఆమె ఆరోగ్యం ఇంతలా దిగజారిపోయేది కాదు. ఇన్ని అనర్థాలు ఈ ఇంటి వల్లే వచ్చాయి. నేనూ, నా భార్యా, నాకు పుట్టబోయే పిల్లలూ, మాకు ప్రత్యేకం ఒక ఇల్లూ అనుకుంటూ ఆలోచించానే కాని, నాకు జన్మ ఇచ్చిన తల్లితండ్రులని గురించీ, ఒకే రక్తం పంచుకు పుట్టిన తోబుట్టువులని గురించీ కాస్తయినా ఆలోచించలేకపోయాను. మనిషిలో విజ్ఞానం పెరుగుతోంది. ఎన్నో అధునాతనమైన పరికలాని కనిపెడుతున్నాడు. జీవితాన్ని సుఖంగానూ, ఆనందంగానూ ఉంచుకోవటానికి ఎన్నో సౌకర్యాలని ఏర్పాటు చేసుకుంటున్నాడు. కాని అతనిలో స్వార్థం పెరిగిపోయింది. మనసు అనుబంధాలనీ, అభిమానాలనీ మరిచిపోయి సుంకుచితం అయిపోతోంది. ఛ.. నేను చాలా పొరపాటు చేశాను. ఇహ ఈ జన్మలో తీర్చుకోలేని పొరబాటు చేశాను." బాధగా తల కొట్టుకున్నాడు సూర్యం.

"అసలు మీకు ఈ ఆలోచన చెప్పింది నేనే. ఈ పాపం అంతా నాదే." అంది సుజాత. ఆమె కళ్లల్లో నీళ్లు తిరిగాయి.

"నువ్వు చెప్తే మాత్రం నా వివేకం ఏమయింది. నేను గట్టిగా వద్దు అని ఉంటే

నువ్వు మాత్రం ఆ ఆలోచన విరమించుకునేదానివి కాదా. సరదాకి అంటూ చేరిన ఉద్యోగం మానేసి అమ్మకి సహాయపడేదానివి కదా. నేనే నా స్వార్థం చూసుకున్నాను."

"అలా బాధ్యత అంతా మీ మీద వేసుకోకండి. నాలోనూ స్వార్థం లేకపోతే నా కిలాంటి ఆలోచనే వచ్చేదు కాదు. సరే జరిగిందేదో జరిగింది. ఇహ ఇప్పుడు మనం చెయ్యగల తెలివయిన పని ఒక్కటే. ఆ ఫ్లాటు మీద ఆశతో, మళ్లీ మూడు లక్షల అప్పు కావాలి అంటూ ఊరి మీద పడకుండా ఆ బిల్డరు ఇస్తానన్న రెండు లక్షలూ తీసేసుకుందాం."

"అంతే చెయ్యాలి. లేకపోతే ఇప్పుడు మనకి మూడు లక్షలు కాదు కదా మూడు పైసలు కూడా ఎవ్వరూ అప్పుగా ఇవ్వరు. అయినా ఈ జంజాటం అంతా వదుల్చుకుందా మనుకుంటా మళ్లీ దాని గురించి ఆలోచించటంలో అర్థం లేదు" అన్నాడు సూర్యం.

"అదే నేను చెప్పేది. ఈ అయిదేళ్లు మనం ఆఫీసులలో తీసుకున్న అప్పు కొంత తీరిపోయింది కనుక అంతా అక్కడ కట్టఖ్కర్లేదు. కోర్టుల చుట్టూ తిరగటానికీ లాయరు ఫీజులకీ మళ్లీ అందినచోటల్లా అప్పు చేశాం కదా. అదీ తీరిపోతుంది ఈ డబ్బుతో" అంది సుజాత.

"అవును. అసలు ఈ ఇంటి గొడవ పెట్టుకోకుండా ఉంటే, ఈ అయిదేళ్లల్లోనూ మనిద్దరి బాంకి బాలెన్స్‌లూ కాస్త పెరిగేవి" అని సూర్యం చెప్తూంటే..

"అన్ని విధాలా నష్టపోయిన మనకి బుద్ధి మాత్రం వచ్చింది. నే నింక ఉద్యోగం మానేస్తాను. అత్తయ్యగారికి కీళ్ల నొప్పులూ, బ్లడ్ ప్రెషరే కాకుండా ఇప్పుడే కేటరేక్టు కూడా వస్తోంది. పాపం ఆవిడ చాలా యాతన పడిపోతున్నారు. ఆవిడికి పూర్తి విశ్రాంతి ఇచ్చి అన్ని పనులూ నేనే చూసుకుంటాను. బాబు కూడా మరీ అల్లరి నేర్చుకుంటున్నాడు. వాడిని కాస్త దారిలో పెట్టి వచ్చే ఏడు స్కూల్లో చేర్పించాలి."

"ఇన్నాళ్లూ ఉద్యోగం చెయ్యటం అలవాటయిన నువ్వు రోజంతా ఇంట్లోనే ఉండగలవా... అంతే కాదు, నెలనెలా నీకు వచ్చే జీతం ఆగిపోతే అప్పుడు పశ్చాత్తాప పడతావేమో?" భార్య ప్రతిపాదనకి సంతోషిస్తూనే తన అనుమానం బయటపెట్టాడు.

"ఆ రెండు ఇబ్బందులనీ తీర్చగలిగే ఉపాయం ఒకటి నాకు తోస్తోంది. నాకు మిషను ఎంబ్రాయిటరీ వచ్చు కదా. బట్టల మీద అది చేసి మనం హోల్ సేల్ షోపుల కివ్వవచ్చు. ఈ విషయంలో మా కమల నాకు సలహా ఇచ్చి సహాయం చేయగలదు" అంది ఎంతో ధైర్యంగా, తృప్తిగా.

మర్నాడు ప్రొద్దుటే సూర్యం, సుజాత విషయం అంతా చెప్తూంటే కామేశ్వరరావుగారూ, కామాక్షమ్మా మొదట విస్తుపోయినా, తరువాత బాధ పడ్డాడు. చివరికి ఉసూరుమంటూ ఓ నిట్టూర్పు విడిచి ఊరుకున్నారు.

కొడుకూ. కోడలూ చేసుకున్న నిర్ణయం బాగానే ఉందనిపించింది వారికి. కోడలు ఉద్యోగం మానేసి ఇల్లు చూసుకుంటా ననటం, అనారోగ్యంతో నలిగిపోతున్న కామాక్షమ్మకీ, ఆవిడ అవస్థ చూడలేక దిగులుపడిపోతున్న కామేశ్వరరావుగారికీ చాలా ఆనందాన్ని కలిగించింది.

మనిషి ఒక్కడినీ గురించి కాక, తన వారందరినీ గురించి కూడా ఆలోచించగలిగితే అందరికీ ఆనందాన్నే ఇస్తుంది మరి. ●



ఓ చిత్ర ప్రదర్శనకు వెళ్లిన చిన్న మనిషి :—

ఈ బొమ్మనిలా వేళ్లాడదీశారేం?

పెద్ద మనిషి : మరేం లేదు. ఈ బొమ్మ వేసినవాడు దొరక్క!




కోరిన కోర్కెలు తీర్చి, సమస్యలను పరిష్కరించే అద్భుత ఉంగరం

అనుభవజ్ఞులైన సిద్ధాంతులతో మంత్రించబడిన అద్భుత మహిమలు కలిగిన మహత్తరమైన ఉంగరం ఈ అద్భుత ఉంగరాన్ని మీరు ధరించినా, చెంత ఉంచుకున్నా మీరు తలచుకునే స్త్రీలైనా, పురుషులైనా ఆకర్షితులై మీకు లొంగిపోతారు. వ్యాపారంలో లాభం, పరీక్షల్లో విజయం, ఉన్నత పదవి, వ్యాపారాభివృద్ధి, లాభాలు, మనసుకు నచ్చిన వారితో పెళ్ళి జరుగుతాయి. వ్యాధులు, కష్టాలు, అప్పులబాధ నుండి విముక్తి, గ్రహబాధలు తొలగి తలపెట్టిన కార్యాలు జయప్రదంగా నెరవేరతాయి. సకల సౌభాగ్యాలు కలిగించే మహత్తుగల ఉంగరం రూ.41/— తమ పేరుకు తగ్గట్టుగా మంత్రించిన (మీకంటూ ప్రత్యేకించి తయారు చేయబడ్డ) వెండితో తయారు చేసిన ప్రత్యేక బాధా నివారిణి ఉంగరం రూ.105/— అత్యధిక శక్తివంతమైన వశీకరణ (బంగారం, వెండి, రాగి మిశ్రమంతో తయారైన) ఉంగరం రూ.251/— తపాల ఖర్చు అదనం. మీరనుకున్నది 12 గంటల్లో జరగకపోతే రెట్టింపు రొక్కం త్రిప్పిపంపడంతో బాటు రూ. 1000/— ఉచితంగా పంపబడుతుంది. ఉంగరం పొందగోరే వారు తమ పేరు, అభిరుచి, రాశి, పుట్టిన తేది, సమయం మొదలైన వివరాలు తప్పక వ్రాయండి.

**GANAPATI ASHRAM (M/2)**
**P.O. Lalbigha (GAYA)**

**చదవండి! చదివించండి!!**

గత రెండు సంవత్సరాలుగా అందరి ఆదరణ పొందుతూ... అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్రీయ, సమాచారంతో పాటు కవర్ స్టోరీ, స్పెషల్ కవరేజ్, కంప్యూటర్ వరల్డ్, జనరల్ నాలెడ్జ్, ఇండస్ట్రీ, మెడిసిన్, క్విజ్ & పజిల్స్, శాస్త్రీయ ఆవిష్కరణలు మొదలగు వివిధ శీర్షికలతో ప్రతి నెలా మీముందుకి వస్తున్న విజ్ఞాన పత్రిక

యువత ప్రతిభకు దిక్సూచి

**ది మాస్టర్స్ జర్నల్**

శాస్త్రీయ దృక్పథంలో విజ్ఞానాన్ని అందించే ఏకైక పత్రిక

వెల. రూ 6-00 మాత్రమే!!

ఏజెన్సీ వివరాలకు : **Sandilya Marketing**, 5-4-670/A, Neo Mysore Cafe Lane, Nampally Station Road, Hyderabad - 1.

చందా వివరాలు : For 6 Months : Rs. 36/- ; 1 Year : Rs. 66/- ; 2 Years : Rs. 120/-; 3 Years : Rs. 162/-; డి.డి/ఎం.ఒ. ద్వారా **The Master's Journal,** పేర తీసి క్రింది అడ్రసుకు పంపించండి. **The Master's Journal,** 5-4-670/A Neo Mysore Cafe Lane, Nampally Station Road, Hyderabad - 1

ది మాస్టర్స్ జర్నల్ చదివితే
ఈ విశాల విశ్వం ఇక మీ అర చేతిలోనే

Sunny Ads